క్లుప్తంగా

కూచిపూడి నృత్య కళాకారులకు అవార్డులు



అవార్డులు అందుకున్న నృత్యకళాకారులు

మంచిర్యాలఅర్బన్: చరిత్రాత్మమైన విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీలో జరిగిన శ్రీ కృష్ణ దేవరాయ అంతర్జాతీయ నృత్యోత్సవంలో మంచిర్యాలకు చెందిన కూచిపూడి కళాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ నెల 27న జరిగిన నృత్యోత్సవంలో పాల్గొన్న 13మంది విద్యార్థులు చిరంజీవులు, జయలక్ష్మి, అలేఖ్య, చిద్విలాస, నేరళ్ల వైష్ణవి, సాయి ప్రణీత, సుష్మ, శివాని, మిథున, అన్వితాసాయి, ఆనంధిత, నలుమాసు వైష్ణవి, సహస్ర, అనన్య శ్రీకృష్ణదేవరాయ అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న కళాకారులను స్నేహ ఫౌండేషన్ అభినందించింది.

ఫిల్మ్ మేకింగ్‌లో ఉచిత శిక్షణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి పరిసర ప్రాంతాల యువతీ, యువకులకు ఉచితంగా బేసిక్ ఫిల్మ్ మేకింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు బెల్లంపల్లి అభివృద్ధి సంస్థ ఫౌండేషన్ కార్యదర్శి ఆదర్శవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎడిటింగ్, ఫొటో, వీడియో ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు 95530 36668, 9177214922, 9703452191 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 374లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం తహసీల్దార్ ఇట్యాల కిషన్ కూల్చి వేయించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించడం సరికాదని సూచించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏమి నిర్మించినా, చర్యలు తప్పవని హెచ్చరించారు. ధర్మారంతాండా గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను పోలీస్టేషన్‌లో ఉంచినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఫీజులు నియంత్రించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వైఎస్ ఆర్‌టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమోద్దీన్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెంచి విద్యార్థులను ప్రభుత్వపాఠశాలల్లోనే చదువుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

కార్గోసేవా కేంద్రం ప్రారంభం

దండేపల్లి: ఆర్టీసీ కార్గోసేవా కేంద్రాన్ని దండేపల్లిలో రిషిత ఆన్‌లైన్ సెంటర్ వద్ద సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీకార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ శ్రీనివాస్, ఆర్టీసీ కార్గో సిబ్బంది రమేష్, మహేశ్వర్, కార్గోసెంటర్ నిర్వాహకుడు భానుప్రసాద్ పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

నస్పూర్: పట్టణ పరిధిలోని పల్లె దవాఖానాల పరిధిలో వడదెబ్బ నివారణ చర్యలపై సోమవారం మంచిర్యాల డివిజన్ వైద్య బృందం సభ్యులు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ పట్టణ పరిధిలోని నస్పూర్, నస్పూర్ కాలనీ, తాళ్లపల్లి, సీసీసీ పల్లె దవాఖానాల పరిధిలో తీవ్రమైన నీళ్ల విరేచనాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ముందు జాగ్రత్తగా ఓఆర్ఎస్ పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దవాఖానాల పరిధిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, జింక్ మాత్రల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు డా.నీలిమ, డా.స్నేహిత, ఏఎన్ఎంలు అక్తర్, వినోద, ఆశ వర్కర్లు పద్మ, శోభ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెన్నెల: మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని చర్చించారు. పలు సమస్యల పరిష్కారానికి తీర్మానం చేశారు. నాయకులు సాంబమూర్తిగౌడ్, గట్టు రాజయ్య, శివలింగయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర



జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో సోమవారం శ్రీ విఘ్నేశ్వర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. బాబు క్యాంపు బస్తీలో ఉన్న శ్రీ శివభక్త మార్కండేయ గణపతి శారద మాతా ఆలయం వద్ద బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు. ప్రత్యేక వస్త్రాధారణతో తరలివచ్చిన మహిళలు 501కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. శివభక్త మార్కండేయ గుడి వద్ద ప్రారంభమైన శోభాయాత్ర కాంటాచౌరస్తా, బజారు ఏరియా, పాత బస్టాండ్ మీదుగా పురవీధుల్లో యాత్ర సాగింది.యువతులు కోలాటం ఆడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేద పండితులు కలశ పూజ, యాగ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ఉమ్మడి రాష్ట్ర ఆప్కో మాజీ చైర్మన్ గడ్డం జగన్నాథం, ఏఎంసీ మాజీ చైర్మన్ సిలివేరు నర్సింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పసుల సునీతారాణి, మహిళా ఉత్సవ కమిటీ, పద్మశాలీ సమాజం శ్రేణులు పాల్గొన్నారు.

గంగమ్మా.. దీవించమ్మా!



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న గంగపుత్రులు



పూనకాలతో ఊగిపోతున్న మహిళలు

పాతమంచిర్యాల: జిల్లాలోని పాతమంచిర్యాల గోదావరి ఒడ్డున గల గంగాదేవి ఆలయంలో ఆదివారం రాత్రి గంగాదేవి బోనాల పండగను గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు పాతమంచిర్యాల నుంచి గంగాదేవి ఆలయం వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లి మమ్ము సల్లంగా చూడాలని కోరుకున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, గట్టయ్య, దయానంద్, మల్లయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీరామ పాదుకులకు పంచామృతాభిషేకం

మంచిర్యాలఅర్బన్: లోక కల్యాణార్థం ఇంటింటా 108రోజుల పాటు నిర్వహిస్తున్న హనుమాన్ చాలిసా పారాయణంలో భాగంగా సోమవా రం వెండితో చేసిన శ్రీరామ పాదుకులకు ఘనంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానం ప్రాంగణంలో దక్షిణముఖంగా కొలువైన ఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడు బాలకృష్ణశర్మ వేద మంత్రోచ్ఛరణ మధ్య పంచామృత అభిషేకం నిర్వహించారు. 54రోజుల పాటు పట్టణంలోని పలువురు ఇళ్లలో నిర్వహించే హనుమాన్‌చాలీసా పారాయణంలో దాతల సహకారంతో తయారు చేయించిన శ్రీరాములవారి పాదులకను పూజలో ఉంచి పారాయణం నిర్వహించినట్లు హనుమాన్ చాలిసా ప్రచారకుడు శ్రీనివాస్ తెలిపారు.

బహిరంగసభ విజయవంతం చేయండి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్ రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులంతా జూన్ 9న జరిగే కేసీఆర్ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. ఆర్కే 6గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సోమవారం ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా ఈ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి అన్ని రంగాల్లో విస్తరింప జేయడమే కాకుండా, కార్మికుల కోసం అనేక హక్కులు కల్పించారన్నారు. రూ.10లక్షల వడ్డీ లేని ఇంటి రుణం, విద్యుత్ బిల్లుల రద్దు చేయించారన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇంక్రిమెంట్ కూడా ఇప్పించారన్నారు. 16శాతం ఉన్న లాభాల వాటాను 30శాతానికి పెంచి ఇచినట్లు తెలిపారు. అనంతరం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సింగరేణిలో ఏదైనా ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే గతంలో రూ. 2లక్షలు ఇస్తే దాన్ని మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా నేడు రూ.20లక్షలకు పెంచి ఇస్తున్నామని తెలిపారు. కార్మికుల ఇళ్లకు ఏసీ పెట్టుకునే సౌకర్యం కల్పించామన్నారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డి.అన్నయ్య, మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, జగదీశ్వర్ రెడ్డి, పోశెట్టి, సంతోశ్, భూమయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: జూన్ 9న నస్పూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. నస్పూర్ పట్టణంలోని 13, 25వార్డుల్లో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ కాలనీలోని సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సభకు పట్టణంలోని కార్మికులు, మహిళలు, యువకులు, భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్‌లో గల విద్యానగర్, నార్లపూర్‌కు చెందిన పలువురు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఇంటిలో ప్రేమ్‌సాగర్‌రావు వారికి కాంగ్రెస్‌పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. టీపీసీసీ సభ్యుడు రమేష్, నాయకులు ఉపేందర్‌గౌడ్, లక్ష్మణ్, రాంచందర్, నీలయ్య, శ్రీనివాస్, రజనీ తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక అయ్యప్ప ఆలయంలో చైర్మన్ డాక్టర్ చుంచు కిరణ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి జన్మదిన ఉత్తర నక్షత్ర పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ స్థాయి అయ్యప్ప సేవా గురుపురస్కార్ అవార్డు పొందిన బీర్‌పూర్ రఘుపతి రావును ఆలయ చైర్మన్ చుంచు కిరణ్, అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ (ఏబీఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు, జిల్లా వలంటరీ కమాండెంట్ మధుకర్, పీఆర్ఏ భాస్కర్ల రాజేశం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నవగ్రహ మండపం పునర్‌నిర్మించిన ద్రాక్షవల్లి రాజశేఖర్, వేద పండితులు సదానంద శర్మలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాలు, సత్యనారాయణ బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

- ప్రజావాణిలో అన్నదాతల వేడుకోలు



దండేపల్లి: గ్రీవెన్స్‌లో రైతుల వినతి

దండేపల్లి: యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, పలువురు రైతులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో డీటీ విజయకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కొనుగోళ్లు చేపట్టడం లేదని, పైగా తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించడంలో జాప్యం చేస్తున్నారని, దీంతో కొనుగోలు కేంద్రాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

కోటపల్లిలో అధికారులు గైర్హాజరు

కోటపల్లి: మండలకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చాయి. కొల్లూర్‌లో ఊరచెరువు కింద అలుగు 10ఫీట్ల వెడల్పుతో ఉండటంతో ఇప్పుడు అది కబ్జాకు గురైందని, దీంతో చెరువు కింద సాగు చేసుకుంటున్న రైతులు ఇబ్బందులు పడుతున్నామని కొల్లూర్ గ్రామస్తులు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 60ని అక్రమంగా పట్టా చేసుకుని 32సర్వే నంబర్ ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని చల్ల తిరుపతిరెడ్డి అనే వ్యక్తి దరకాస్తు అందజేశారు. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణికి అధికారులు డుమ్మా కొట్టడంతో దరకాస్తులు ఇచ్చేందుకు వచ్చినవారు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రజావాణిలో దరాఖాస్తు స్వీకరించే ఎంపీడీవో వ్యక్తిగత కారణాలతో లీవ్‌లో ఉండగా, అధికారులు ఎవరూ రాలేదు. వెటర్నరీ డాక్టర్, ఏపీవో, రెవెన్యూ శాఖకు చెందిన జూనియర్ అసిస్టెంట్ మాత్రమే హాజరు కాగా మిగితా శాఖల అధికారులు ఎవరూ హాజరు కాలేదు.

వేమనపల్లిలో నిల్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు జిల్లా మీటింగ్‌కు హాజరుకాగా మండల అధికారులతో ప్రజావాణి కొనసాగింది. ఎలాంటి అర్జీలు రాలేదు. ఏపీఓ సత్యప్రసాద్, ఐకేపీ సీసీ శివరాం, సీఆర్పీ అశోక్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ భవనం నిర్మించాలని వినతి'

జైపూర్: మండలంలోని పెగడపల్లిలో అంబేద్కర్ భవనం నిర్మించాలని కోరుతూ అంబేద్కర్ యువజన సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంగాధరి మల్లేశ్, ఎనగందుల మల్లేశ్, మధు, రవితేజ, రామగిరి పాపయ్య, నాగార్జున, కిరణ్ తదితరులు ఉన్నారు.

'చెన్నూర్‌లో రెండు దరఖాస్తులు'

చెన్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు దరకాస్తులు వచ్చాయి. సంబంధిత అధికారులకు పంపించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహాధర్నాకు వెళ్లకుండా వీఓఏల అరెస్టు

బెల్లంపల్లి/వేమనపల్లి: హైదరాబాద్ ఇందిరాపార్కులో జరిగే మహాధర్నాకు వెళ్లకుండా సోమవారం బెల్లంపల్లి, జైపూర్, నీల్వాయి పోలీసులు వీఓఏలను అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

ఎన్నిక

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మెడికల్ బ్రాంచ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంయుక్త కార్యవర్గ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకుబ్ పాషా ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించి, అధ్యక్షురాలిగా ఎస్.ప్రతిభ, కార్యదర్శిగా ఏ.వెంకటేశ్, కోశాధికారిగా కె.సోఫియా ఒలివర్‌లను ఎన్నుకున్నారు.

'తాగుబోతుల అడ్డాగా రైతువేదిక'

వేమనపల్లి: మండల కేంద్రంలో మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన రైతు వేదిక తాగుబోతులకు అడ్డాగా మారిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలోని తొమ్మిది సంవత్సరాల మోడీ పాలన సందర్భంగా సోమవారం మహాజన్‌సంపర్క్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతువేదిక తలుపులు, దర్వాజలు చెడిపోయి పశువుల పాకగా మారిందని, రైతు వేదికలో అసాంఘిక కార్యకలాపాలకు, అపరిశుభ్రతకు నిలయంగా మారిందని ఆరోపించారు.

'అరెస్టును ఖండిస్తున్నాం'

జైపూర్: పార్లమెంట్ ప్రారంభోత్సవం రోజున తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లను ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేయడాన్ని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా సోమవారం డీఎస్‌యూ జిల్లా కన్వీనర్ సికిందర్ తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

శ్రీరాంపూర్: మహిళల సంపూర్ణ ఆరోగ్యం సాధికారికతపై అర్పణ చారిటబుల్ ట్రస్ట్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో మహిళలకు వీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాలి రమేష్ మాట్లాడుతూ.. మహిళా ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ట్రస్ట్ తరఫున మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు శానిటరీ నాప్కిన్ ప్యాక్స్‌ను అందించారు.

'రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు ఇంకెన్నాళ్లు..?'

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే పట్టింపులేనితనం వల్లే బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ నుంచి శ్రీరాంపూర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణపు పనులు కేవలం రెండేళ్లలోనే దాదాపు పూర్తికాగా, ఇక్కడి రైల్వే బ్రిడ్జి మాత్రం ఇంకా నత్తనడకన సాగుతోందన్నారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా చొరవ చూపించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

ఏడాదైనా పనులు కాలే..!

- నత్తనడకన సాగుతున్న రాముని చెరువు సుందరీకరణ పనులు
- చెరువుకు గండికొట్టి రెండేళ్లు
- వర్షాకాలం వస్తుండడంతో పనులు కష్టమే?



చెరువు కట్టపై సాగుతున్న పనులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3.50కోట్లతో పనులను గతేడాది ఏప్రిల్ 25న అప్పటి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి, ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రారంభించారు. ఏడాదిలోపు పనులను పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా, ఇప్పటికీ కనీసం సగం పనులు కూడా పూర్తి చేయలేదు. చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించక ముందే చెరువులోకి చేరిన హైటెక్‌సిటీ, జాఫర్‌నగర్ కాలనీలకు చెందిన డ్రెయినేజీ నీటిని పూర్తిగా తొలగించాలని ఏడాదిన్నర క్రితమే చెరువుకు గండికొట్టారు. నాటి నుంచి చెరువులోకి చేరుతున్న మురికి నీటితో పాటు, వర్షపు నీరు మత్తడి కాలువ నుంచి బయటకు వెళ్లిపోతుంది. చెరువులోని మురుగు నీరు పూర్తిగా ఖాళీ చేసి, అందులోని పిచ్చి మొక్కలను తొలగించడం, పూడిక తీసి, కేవలం వర్షపు నీటిని మాత్రమే చెరువులోకి చేరేలా చేయాల్సిన పనులను ఇప్పటికీ అధికారులు చేపట్టడం లేదు.

ఏడాదిగా సాగుతూ.....

గతేడాది నుంచి పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తుండడంతో, అందులో కనీసం సగం పనులు కూడా పూర్తికాలేదు. ఈ వేసవికాలంలోనే అన్ని పనులను పూర్తి చేసి, మున్సిపల్ అధికారులకు అప్పగించాల్సి ఉంది. మరో పది రోజుల్లో వర్షాలు పడేందుకు అవకాశం ఉండగా, వర్షాకాలం ప్రారంభమైతే పనులను చేయడం కష్టమే.

జూన్‌లో పనులన్నీ పూర్తి చేస్తాం



రామునిచెరువు అభివృద్ధి పనులను ఈ వేసవిలోనే పూర్తి చేయాలని అనుకున్నా వీలు కాలేదు. పెండింగ్ పనులన్నింటినీ జూన్ రెండోవారంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు, డ్రెయినేజీ నీరు చెరువులోకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం. రెండు మురికి నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం.

– మధుకర్, మున్సిపల్ ఇంజినీర్

ఘనంగా అవతరణ, దశాబ్ది ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఏరియా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో డిపార్ట్‌మెంట్ల ముఖ్య అధికారులు, గనుల ముఖ్య అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. 134ఏళ్ల సింగరేణి చరిత్రను, నేడు తెలంగాణలో సాధించిన ప్రగతిని ఈ ఉత్సవాల సందర్భంగా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం షార్ట్ ఫిల్మ్ తీర్చిదిద్దినట్లు తెలిపారు. మైదానంలో ఫొటో ఎగ్జిబిషన్లు, ప్రగతి పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు. ఉద్యోగులకు స్వీట్ ప్యాకెట్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను జూన్ 5వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవింద్ రావు, ఇతర డీజీఎంలు శివరావు, చంద్రశేఖర్ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉత్సాహంగా ఆటల పోటీలు



పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సోమవారం అన్ని గనులు, డిపార్టుమెంట్లకు చెందిన మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. టగ్‌ఆఫ్‌వార్, బాంబ్‌బ్లాస్ట్, త్రో బాల్ పోటీలు నిర్వహించగా, ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ ప్రకాష్‌రావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో ఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

'వేతన ఒప్పందంలో కార్మికులకు అన్యాయం'



మాట్లాడుతున్న శ్రీనివాస్

తాండూర్: 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో జాతీయ కార్మిక సంఘాలు కార్మికులకు అన్యాయం చేశాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు విమర్శించారు. ఏరియా వర్క్‌షాప్ వద్ద సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఇంటి అద్దె పెంచలేదన్నారు. ఇంక్రిమెంట్ రేట్‌ను పెంచకుండా సిక్ లీవ్‌లను అమ్ముకోకుండా తప్పుడు ఒప్పందం చేసుకోవడంతో కార్మికులకు నష్టం కలిగే అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. కార్మికులకు బేసిక్ పెరుగుదల, ఇంక్రిమెంట్ రేట్ పెరుగుదల కూడా తక్కువగా ఉందన్నారు. ఏ తీరుగా చూసినా కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఒప్పందంలో మేలు జరగలేదని విమర్శించారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు ప్రకాష్‌రావు, మంగీలాల్, సదాశివ, శ్రీనివాస్, రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు క్లబ్‌లో సంబురాలు



నృత్యం చేస్తున్న మహిళలు

మందమర్రిరూరల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాన్ని ఏరియా జీఎం సతీమణి, ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు యశోద హాజరై ప్రారంభించారు. మహిళలకు పాటల, నృత్య పోటీలు నిర్వహించారు.

ఆర్థిక సాయం

జన్నారం: ఉపాధి కోసం ఓమన్ దేశం వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన అంబటి అనంతయ్య కుటుంబానికి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కవ్వాల్ శాఖ ఆధ్వర్యంలో రూ.10వేలు తక్షణ సాయం కింద ఆర్థిక సాయం అందజేశారు.